ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

శుక్రవారం 13 జూన్ 2025

'రాజీవ్ యువ వికాసం'.. నిరుద్యోగుల్లో ఎన్నో ఆశలను రేపిన పథకం. లబ్ధిదారులుగా ఎంపికై ఉపాధిని పొందవచ్చని నిరుద్యోగులు భావించారు. పథకం అమలు కోసం వేయికళ్లతో ఎదురుచూస్తూ వచ్చారు. అయితే ఈ పథకానికి ప్రభుత్వం ఆకస్మికంగా బ్రేకులు వేసింది. నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో పెట్టుబడి సాయం అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని రూపొందించిన విషయం విధితమే. గత ఏప్రిల్ 15 వరకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అధికారులు దరఖాస్తులను సైతం వడపోశారు. అర్హతలున్నవారిని ఎంపిక చేసి, జూన్ 2న రూ.50వేల, రూ.లక్ష లోపు రుణాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఇస్తామని ప్రకటించారు. అయితే ఏమైందో ఏమోగానీ, అకస్మాత్తుగా మంజూరు పత్రాల పంపిణీకి సర్కారు బ్రేక్ వేసింది. దీంతో రుణసాయం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు షాక్ గురయ్యారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పథకం అమలుకు బ్రేక్ వేసినట్టు భావిస్తున్నారు. అదే నిజమైతే మరో రెండు నెలల పాటు 'వికాసం' అలికిడి వినిపించదన్నమాట.



- మంజూరు పత్రాల పంపిణీ నిలిపివేత
- రూ.50వేలు, రూ.లక్ష యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని తొలుత నిర్ణయం
- జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని ప్రకటన
- అకస్మాత్తుగా పథకానికి బ్రేకులు వేసిన ప్రభుత్వం
- మంజూరైన యూనిట్ల కంటే ఎస్సీ, బీసీల్లో అర్హుల్లో అధికం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,91,235 దరఖాస్తులు
- స్థానిక ఎన్నికల తర్వాత అమలు చేస్తారని అంచనా

ఆశలు గల్లంతు

రాజీవ్ యువ వికాసం అమలుకు సర్కారు బ్రేక్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజీవ్ యువవికాసం కింద రూ.50వేల నుంచి గరిష్ఠంగా రూ.4లక్షల వరకు రుణాలు అందించేందుకు నాలుగు గ్రేడ్లుగా విభజించి, రాయితీ ప్రకటించింది. రూ.50వేల వరకు 100శాతం రాయితీని ప్రకటించింది. అలాగే రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90శాతం రాయితీని, రూ.1,00,001 నుంచి రూ.2లక్షల వరకు 80శాతం రాయితీ, రూ.2,00,001 నుంచి రూ.4లక్షల వరకు 70శాతం రాయితీతో రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి వరంగల్ పరిధిలో 1,377రెవెన్యూ గ్రామాల నుంచి 1,91,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 49,276మంది దరఖాస్తులు చేసుకోగా, ఎస్టీల నుంచి 33,427, బీసీ కార్పొరేషన్ ద్వారా 95,479 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఈబీసీల నుంచి 2,806 దరఖాస్తులు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 10,015 దరఖాస్తులు, క్రిస్టియన్ మైనార్టీల నుంచి 232 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా నుంచి 48,702 దరఖాస్తులు రాగా, అతి తక్కువగా మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లా నుంచి కేవలం 3,518 దరఖాస్తులే వచ్చాయి. వివిధ రకాల విచారణల అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారులు ప్రభుత్వానికి పంపించారు.

మంజూరు పత్రాల పంపిణీకి బ్రేక్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,91,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి జూన్ 9వ తేదీ వరకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని, జూన్ 15వ తేదీ లోపు లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలుత రూ.50వేలు, రూ.లక్ష లోపు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకే మంజూరు పత్రాలు అందిస్తారని అధికారులు తెలిపారు. జూన్ 2న మంజూరు పత్రాలు అందుకునే లబ్ధిదారుల జాబితాను కూడా కొన్ని జిల్లాల్లో అధికారులు సిద్ధం చేశారు. అయితే అనూహ్యంగా ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో నిరుద్యోగులు షాక్ గురయ్యారు. ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగినట్లుగా జరుగుతున్న ప్రచారంతోనే ప్రభుత్వం వెనకడుగు వేసినట్లుగా భావిస్తున్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా కూడా లబ్ధిదారులను ఎంపిక

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

జిల్లా	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఈబీసీ	మైనార్టీ	క్రిస్టియన్	మొత్తం
వరంగల్	10,490	6,031	22,972	616	3,798	66	43,973
హనుమకొండ	13,608	1,624	23,782	598	2,494	68	42,174
జనగామ	8,679	3,787	15,757	447	981	48	29,699
మహ-బాద్	8,963	18,809	18,546	579	1,766	39	48,702
భూపాలపల్లి	6,877	2,338	12,567	522	855	10	23,169
ములుగు	659	838	1,855	44	121	01	3,518
మొత్తం	49,276	33,427	95,479	2,806	10,015	232	1,91,235

(మిగతా 6వ పేజీలో...)



మృతిచెందిన యువకులు

6

టైరు పేలి.. చెట్టును ఢీకొట్టి..

- కారు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



సరోజన (ఫైల్)

ఆస్తి తగాదాలతో హత్య

- సవతి తల్లిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు
- పెగడపల్లిలో దారుణం

6

హనుమకొండ కలెక్టర్‌గా స్నేహ శబరీష్

- సంగారెడ్డి కలెక్టర్‌గా ప్రావీణ్య బదిలీ



స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హనమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా స్నేహ శబరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్నేహ శబరీష్ ఇంతకుముందు హైదరాబాద్ జీహెచ్ఎంసీ అడిషినల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. కాగా, ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన పి.ప్రావీణ్య సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్

- ప్రస్తుత కమిషనర్ అశ్విని కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ



చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్ నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. కాగా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా పనిచేస్తున్న అశ్విని తానాజీ వాకడేను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ)గా బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. అశ్విని గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా గత ఏడాది మార్చి 14న వచ్చారు. నగరంలో స్మార్ట్‌సిటీ పనులతో పాటు నగరంలో వివిధ అభివృద్ధి పనులను నిర్వర్తించి తన మార్క్ చూపించారు. ఇక నూతన కమిషనర్‌గా వస్తున్న చహత్ బాజ్‌పాయ్ 2019లో సివిల్స్‌లో ఆల్ ఇండియా 59వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. శిక్షణ కాలం పూర్తి చేసిన తర్వాత నంద్యాల జిల్లా సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ గ్రేటర్ వరంగల్‌కు పోస్టింగ్‌పై వస్తున్నారు. ఆమె నేడో, రేపో విధుల్లో చేరుతారని తెలిసింది.

పాఠశాలల కళకళ

- సందడిగా మొదలైన విద్యాసంవత్సరం
- ఉత్సాహంగా తరలివచ్చిన విద్యార్థులు
- అందంగా ముస్తాబైన పాఠశాలల ప్రాంగణాలు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసిన కలెక్టర్లు



హనుమకొండ న్యూ శాయంపేట పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం సందడిగా మొదలైంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. ఊరువాడా, పట్టణం పల్లె అనే తేడా లేకుండా పిల్లలు దారుల వెంబడి బడి బ్యాగులతో పాఠశాలలకు తరలివెళ్లడం కనిపించింది. పాఠశాల ప్రాంగాణాలన్నీ కళకళలాడాయి. బడి బాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవాస ప్రాంతాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఉపాధ్యాయులు చేబూని పిల్లలను క్లాసుల్లోకి తీసుకెళ్లగా, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పువ్వులు ఇస్తూ విద్యార్థులు పాఠశాలల్లోకి అడుగిడటం కనిపించింది. కాగా, ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయగా వరంగల్ జిల్లాలో 13, హనుమకొండ జిల్లాలో 16 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఖిలా వరంగల్ మండలంలోని గుంటూరుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. హనుమకొండ జిల్లాలో న్యూశాయంపేటలోని పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కావ్య, కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు అందజేస్తుందన్నారు. అలాగే కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. వర్ధన్నపేట మండల పరిధిలోని పలు పాఠశాలల్లో డీఈవో జ్ఞానేశ్వర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయగా, హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వాసంతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణను కోరాలి..

- సూత్రధారులు, పాత్రధారుల పేర్లను బయటపెట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి సీబీఐ విచారణను కోరాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. కేంద్రంలో బీజేపీ పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీకే అరుణ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎంలో కుర్చీలో ఎన్ని రోజులు ఉంటాడో తెలియదని, ఉన్నప్పుడే కాళేశ్వరం అవినీతిలో సూత్రధారులు, పాత్రధారుల పేర్లు బయటపెట్టి విశ్వసనీయతను చాటుకోవాలన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ అవినీతిని బయటపెట్టి జైలుకు తరలిస్తామని దొంగ మాటలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్ వద్ద రూ.200 కోట్లు పట్టుబడ్డాయని మీడియాలో చూశామని, దీనిని బట్టి కాళేశ్వరం నిర్మాణంలో ఎవరెవరికి ఎంత వాటా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. 3 పర్యాయాలు ప్రధాని మోదీని ఒప్పించి రాష్ట్రానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తుంటే.. అభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నాడని సీఎం విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక దేశంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులు, రైల్వే మార్గాలు, ప్రాజెక్టులు రెండింతలుగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో సుమారు 7,000 కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారులు నిర్మించామన్నారు. భారతదేశ కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటుతూ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచి, ఉగ్రదాడులకు సమాధానం చెప్పారన్నారు. వ్యాపారాలు పెట్టుకునే వారికి బాసటగా నిలిచారన్నారు.

2047 వరకు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారని అన్నారు. తొలుత ఆమె 11ఏళ్లలో చేసిన అభివృద్ధిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కార్పొరేటర్లు చాడ స్వాతిరెడ్డి, గుజ్జుల వసంత, బైరి లక్ష్మి, రావుల కోమల నాయకులు కాశీప్రసాద్, కిషన్, సీతారాంనాయక్, దేవేందర్‌రెడ్డి, విజయచందర్‌రెడ్డి, సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిపైనే పోటీ చేస్తా..

- ఫోన్‌ట్యాపింగ్ నుంచి తప్పించుకోలేరు.. మంత్రిగా అక్రమాలకు పాల్పడ్డారు..
- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి



వరంగల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎక్కడి నుంచి పోటీ చేసినా, తాను ఆయనపై అక్కడి నుంచే పోటీకి దిగుతానని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. అమెరికాలో స్థిరపడిన తాను.. ఎర్రబెల్లి చేసిన తప్పుల వల్లే రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళలకు 33శాతం సీట్లు రిజర్వుడు అవుతాయన్నారు. పాలకుర్తి మహిళలకే రిజర్వుడు అవుతుందని, అక్కడి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పోటీ చేస్తారని తెలిపారు. ఎర్రబెల్లి ఎక్కడికి పారిపోయి పోటీ చేసినా తాను ఆయనపై పోటీ చేస్తానని తెలిపారు. వర్ధన్నపేట నుంచి ఎర్రబెల్లి పోటీకి దిగితే తాను రెడీ అన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి జైలుకు వెళతారని చెప్పారు. తన ఫోన్‌లు కూడా ట్యాపింగ్‌కు గురయ్యాయని, ప్రభాకర్‌రావును పోలీసులు విచారిస్తున్నారని, త్వరలోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఝాన్సీరెడ్డి అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్త్రీనిధి రుణాల గోల్‌మాల్ చేశారని, వీటిపై విచారణ జరుగుతోందని, త్వరలోనే ఎర్రబెల్లి జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఝాన్సీరెడ్డి పేర్కొన్నారు.



రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పీసీ ఘోష్

రామప్పలో పీసీ ఘోష్ పూజలు

వెంకటాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో గల చారిత్రక రామప్ప ఆలయాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఘోష్.. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకున్నారు. బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోలీసులను దుర్భాషలాడిన ముగ్గురు యువకులపై కేసు

వరంగల్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పోలీసులను దుర్భాషలాడిన ముగ్గురు యువకులపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి కథనం ప్రకారం.. బుధవారం రాత్రి కేయూ జంక్షన్‌లో హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా సాయికుమార్ అనే యువకుడు పట్టుబడ్డాడు. యువకుడి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్న క్రమంలో తన స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. సాయికుమార్ పిలుపుతో కేయూ జంక్షన్‌కు వచ్చిన రవీందర్, ఆరీఫ్ అనే యువకులు ట్రాఫిక్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడారు. కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు హనుమకొండ నుంచి ఆర్టీసీ బస్సు

హనుమకొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల కోసం హనుమకొండ నుంచి ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు వంగల్ ఆర్ఎం డి.విజయభాను గురువారం ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి జూన్ 27న మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం వెల్లూరులోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దర్శనం తర్వాత అరుణాచలేశ్వర స్వామి ప్రదక్షిణకు జూన్ 29న జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధి బీచుపల్లి హనుమాన్ ఆలయం దర్శనం అనంతరం హనుమకొండకు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి పెద్దలకు రూ.5వేలు, పిల్లలకు రూ.3500 ఆర్టీసీ సంస్థ టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆర్ఎం కోరారు. పూర్తి సమాచారం కోసం సెల్ నెంబరు 9063407493, 7780565971, 9866373825, 9959226047 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండ్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో రాజీపడే అవకాశం ఉంటుందన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమాయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరు వర్గాలను పిలిపించి రాజీపడేటట్లు అవగాహన కల్పించాలన్నారు. రాజీకోసం ఎదురుచూసే వ్యక్తులు పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు. దీనిద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు.

సర్కారు బడుల్లో చిన్నారులకు విద్య

ప్రీప్రైమరీ స్కూళ్లను ప్రారంభించిన ప్రభుత్వం ● ఉమ్మడి జిల్లాలో 61 చోట్ల ప్రారంభం



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో తమ ఐదేళ్లలోపు చిన్నారులను చేర్పించాలన్న తల్లిదండ్రుల ఆశలను ప్రభుత్వం నెరవేర్చింది. విద్యా సంవత్సరం ప్రారంభం నాడే ఎంపిక చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపిక చేసిన 61 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించారు. గత ఏడాది వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 5 సంవత్సరాలు దాటిన పిల్లలకు మాత్రమే 1వ తరగతిలో ప్రవేశాలను కల్పించేవారు. ఇక ఈ ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరగనున్నాయి. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని సర్వత్రా విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

ఐదేళ్లు దాటని చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు లేకపోవడంతో చిన్నారులను తల్లిదండ్రులు వారికి దగ్గరున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే వారు. తొలుత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని భావించింది. అయితే అక్కడ ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారు లేకపోవడం, చిన్నారులకు విద్యను నేర్పించే అనుభవం అంగన్‌వాడీ కార్యకర్తలకు లేకపోవడంతో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు కేంద్రప్రభుత్వ ఆధీనంలోని సమగ్ర శిక్ష అభియాన్ నుంచి నిధులు సమకూరనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 61 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అనుగుణంగానే సంబంధిత జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ఆయా పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ఏర్పాటుకు అన్ని చర్యలు చేపట్టి తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ జిల్లాలో ఎంపీపీఎస్ స్వామిరావ్‌పల్లి, ఎంపీపీఎస్ లక్కమారిపల్లి, ఎంపీపీఎస్ తొగర్రాయి. ఎంపీయూపీఎస్ రేకంపల్లి, ఎంపీపీఎస్ రామతీర్థం, ఎంపీయూపీఎస్ లెంకలపల్లి, ఎంపీపీఎస్ లింగపురం, ఎంపీపీఎస్ కొండూరు, ఎంపీయూపీఎస్ గన్నారం, ఎంపీపీఎస్ కొత్తూరు, ఎంపీపీఎస్ బుర్హాన్‌పల్లి, ఎంపీపీఎస్ పైడిపెల్లి, జీపీఎస్ శంభునిపేటలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లాలో ఎంపీపీఎస్ పరకాల, ఎంపీయూపీఎస్ మైలారం, ఎంపీయూపీఎస్ ప్రగతిసింగారం, ఎంపీపీఎస్ ఊరుగొండ, ఎంపీపీఎస్ సీతారాంపూర్, ఎంపీయూపీఎస్ రత్నగిరి, ఎంపీపీఎస్ మాణిక్యాపూర్, ఎంపీపీఎస్ కొప్పూర్, ఎంపీపీఎస్(ఎస్సీకాలని) ముల్కనూర్, ఎంపీపీఎస్ ముల్కనూరు, ఎంపీపీఎస్ బావుపేట్, ఎంపీపీఎస్ కేశవాపూర్, జీపీఎస్ గర్ల్స్ కాజీపేట, జీపీఎస్ గొల్లపల్లి, జీపీఎస్ పాలెం, జీపీఎస్ రాంనగర్. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎంపీపీఎస్ కూడురుపల్లి, ఎంపీయూపీఎస్ బోర్లగూడెం, ఎంపీపీఎస్ గర్మిల్లపల్లి, ఎంపీపీఎస్ టేకుమట్ల, ఎంపీపీఎస్ తిరుమలగిరి, ఎంపీపీఎస్ రేగొండ, ఎంపీపీఎస్ జగ్గయ్యపేట్, ఎంపీపీఎస్ పరశురాంపల్లి, ఎంపీపీఎస్ రంగరావుపల్లి, ఎంపీపీఎస్ కొండాపూర్, ఎంపీపీఎస్ గొర్లవీడు, ఎంపీపీఎస్ కొత్తపల్లి(ఎస్ఎం), ఎంపీయూపీఎస్ గుడాడ్‌పల్లి, ఎంపీపీఎస్ మహబూబ్‌పల్లి, ఎంపీపీఎస్ మంజూర్‌నగర్, ఎంపీపీఎస్ కొంపల్లి, ఎంపీయూపీఎస్ పుల్లూరురామయ్యపల్లి, ఎంపీపీఎస్ జంగేడు, ఎంపీపీఎస్ బెడ్డలోనిపల్లి, ఎంపీపీఎస్ సెగ్గంపల్లి, ఎంపీపీఎస్ ఫకీర్‌గడ్డ, ఎంపీపీఎస్ గడ్డిగానిపల్లి, ఎంపీయూపీఎస్ కాసీంపల్లి, ఎంపీపీఎస్ వేశాలపల్లి, ఎంపీపీఎస్ కమలాపూర్, ఎంపీపీఎస్ రాంపూర్, ఎంపీపీఎస్ ఎర్రయ్యపల్లి, ఎంపీపీఎస్ కృష్ణకాలనీ, ఎంపీపీఎస్ సుభాష్‌కాలనీ, ఎంపీపీఎస్ రామ్‌నాయక్‌తండ, ఎంపీపీఎస్ గుర్రంపేటలో ప్రారంభించగా ములుగు జిల్లాలో ఒకే ఒక్క స్కూలు ఎంపీపీఎస్ మంగపేటలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం అయ్యాయి.

రైలులో పరారైన దొంగ

కస్టడీ నుంచి తప్పించుకున్న దొంగ కోసం పోలీసుల గాలింపు

మట్టెవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు కస్టడీ నుంచి పరారైన దొంగకోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలిస్తున్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్లలో గల సీసీ ఫుటేజీలను, వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో గాలించారు. బైక్ చోరీ కేసులో నిందితుడు కడిపికొండకు చెందిన కట్కూరి సాయికుమార్‌ను బుధవారం కాజీపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.జనార్దన్, కానిస్టేబుల్ సునీల్‌కుమార్‌లు వైద్య పరీక్షల నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తీసుకొచ్చారు. మొదటగా ఈసీజీ తీయించారు. అనంతరం టూడీ ఏకో పరీక్ష నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. తిరిగి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి నిందితుడు సాయికుమార్‌ను తీసుకొచ్చారు. రిపోర్టుల కోసం కానిస్టేబుల్ వెళ్లగా, మరో కానిస్టేబుల్ కస్టడీలో సాయికుమార్ ఉన్నాడు. ఈ క్రమంలో బాత్‌రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పి కానిస్టేబుల్‌ను చేతితో నెట్టేసి ఎంజీఎం నుంచి పరార్ అయ్యాడు. సాయికుమార్‌ను పట్టుకోవడం కోసం పోలీసులు వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు వరంగల్ ప్రధాన కూడళ్లలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఎంజీఎం నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బుధవారం రాత్రి రైల్వే స్టేషన్‌కు పోలీసులు చేరుకొని గాలిస్తుండగా పోలీసులను చూసిన సాయికుమార్.. విజయవాడ వైపు వెళుతున్న రన్నింగ్ రైలు ఎక్కి పరార్ అయ్యాడు. పోలీసులు వెంటనే మరో రైలులో ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లినా నిందితుడి ఆచూకీ లభించలేదు. కాజీపేట, మట్టెవాడ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అతడి కోసం గాలిస్తున్నారు.

ప్రతీ అమావాస్యకు వీరభద్రస్వామికి అభిషేకం



భీమదేవరపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రతీ నెల అమావాస్యను పురస్కరించుకుని వీరభద్ర స్వామికి విశేష అభిషేకం, భద్రకాళి అమ్మవారికి చండీ హోమం నిర్వహించాలని సంకల్పించినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. గురువారం కొత్తకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు లోక కల్యాణార్థం అభిషేకాలు, చండీ హోమాలు నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారన్నారు. దీంతో ప్రతీ నెల అమావాస్యను పురస్కరించుకుని వీరభద్ర స్వామికి అభిషేకాలు, అమ్మవారికి చండీహోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈవో కిషన్‌రావు కోరారు.

కరీంనగర్-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

వచ్చే నెల 6 నుంచి 28 వరకు నడపనున్న దక్షిణమధ్య రైల్వే

గిర్మాజీపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6 నుంచి 28వ తేదీ వరకు కరీంనగర్-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 6 నుంచి 27 వరకు ప్రతీ ఆదివారం తిరుపతి నుంచి కరీంనగర్‌కు 4 ప్రత్యేక రైళ్ల(రైలు నెంబరు 02761) నడుస్తాయని చెప్పారు. అలాగే జూలై 7 నుంచి 28వ తేదీ వరకు ప్రతీ సోమవారం కరీంనగర్ నుంచి తిరుపతికి 4 ప్రత్యేక రైళ్ల(రైలు నెంబరు 02762) నడుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లలో ఆగుతాయని తెలిపారు. తిరుపతి-కరీంనగర్ మధ్య ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నడపనున్న ఈ రైళ్లను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పీజీ రెగ్యులర్ కోర్సుల రెండో సెమిస్టర్ ఫీజు గడువు 20

కేయూ క్యాంపస్ జూన్ 12, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల రెగ్యులర్ పరీక్షల ఫీజులు చెల్లించుకునేందుకు జూన్ 20 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు గురువారం తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జూన్ 26 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. రెగ్యులర్, ఇంప్రూమెంట్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి జంతుశాస్త్ర విభాగంలో కార్యశాల

కేయూ క్యాంపస్ జూన్ 12, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో జూన్ 13 నుంచి మూడు రోజుల పాటు కార్యశాల నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'హ్యాండ్స్ ఆన్ మ్యాలిక్యూలర్ డాగింగ్ అండ్ డ్రగ్స్ డిస్కవరీ టెక్నిక్సు' అనే అంశంపై జరిగే ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కేయూ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, జంతుశాస్త్ర విభాగం బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈసం నారాయణ హాజరుకానున్నట్లు వెల్లడించారు. 13న ఉదయం 10 గంటలకు కేయూ జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో సదస్సు ప్రారంభం అవుతుందని వెల్లడించారు.



నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

స్థానిక ఎన్నికలను నిర్వహించే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు..

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. నర్సంపేట పట్టణంలో గురువారం బీఆర్ఎస్ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందువల్లే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి ఆలస్యం చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా బీఆర్ఎస్‌దే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న జల దోపిడీపై ప్రజలు, రైతులు చైతన్యం కావాలని కోరారు. గోదావరి జలాలను ఆంధ్రప్రాంతానికి తరలించడానికి కాళ్ళేశ్వరంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్రలు చేస్తోన్నారని ఆరోపించారు. తన గురువు చంద్రబాబు కోసం కాళేశ్వరంపై బురదజల్లే ప్రయత్నం ముఖ్యమంత్రి చేస్తున్నారని అన్నారు. ఆంధ్ర ప్రాంతంలో నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు కోసం గోదావరి నీటిని లిఫ్టుచేయడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కలిసి తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు వరంగల్ జిల్లాను సస్యశ్యామలం చేసే దేవాదుల, సీతారామ, రామప్ప, పాఖాల, రంగాయచెరువు లాంటి ప్రాజెక్టులను ఎండబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, నర్సంపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నల్లబెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, హింగె మురళి, బాల్నె వెంకన్న, కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్, రాజేశ్వరరావుతో పాటు వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో హత్య

● సవతి తల్లిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు ● పెగడపల్లిలో దారుణం

హసన్‌పర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి గొడవల్లో తనకు న్యాయం జరగడం లేదనే కోపంతో సవతి తల్లి(60)ని ఓ యువకుడు గొడ్డలితో నరికి చంపాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ ఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలోని పెగడపల్లిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

పెగడపల్లికి చెందిన చల్లా శ్రీనివాస్‌రెడ్డి మొదటి భార్యకు భూపాల్‌రెడ్డి, మరో ఇద్దరు కూతుళ్లున్నారు. శ్రీనివాస్‌రెడ్డి మొదటి భార్య 30 ఏళ్ల క్రితం మృతి చెందగా, సరోజన అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. సరోజనకి ఇద్దరు కూతుళ్ళ మంగ, మమత ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డికి 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో ఐదున్నర ఎకరాలు భూపాల్‌రెడ్డి, మూడు ఎకరాలు శ్రీనివాస్‌రెడ్డి, రెండున్నర ఎకరాలు సరోజన పంచుకున్నారు. భూపాల్‌రెడ్డి తన తండ్రి బాగోగులు చూసుకుంటూ తన ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమితో పాటు తల్లిదండ్రులకు సంబంధించిన ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమిని కూడా కౌలుకు దున్నుకుంటున్నాడు. భూపాల్‌కు భార్య శైలజతో పాటు ఇద్దరు కూతుళ్ల వున్నారు. ప్రస్తుతం వారు పెళ్లికి ఎదగడంతో శ్రీనివాస్‌రెడ్డి వారికి వివాహం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. సవతి తల్లి సరోజన ఇద్దరు కూతుళ్ళ ఆడ పిల్లలు కూడా పెళ్లికి ఎదిగి ఉన్నారు. ఈ క్రమంలో తండ్రి, సవతి తల్లి ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పెళ్ళిళ్లు చేసుకొని వెళ్లిన కూతుళ్ళకు కూడా సవతి తల్లి తన వారసత్వ భూమిని దోచి పెడుతోందని, తనకు అన్యాయం చేస్తోందని భూపాల్‌రెడ్డి మదనపడేవాడని గ్రామస్తులు తెలిపారు.



రక్తపు మడుగులో సరోజన

ఈ క్రమంలోనే భూపాల్‌రెడ్డి కౌలు చేసుకుంటున్న సరోజనకు చెందిన రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని మరొకరికి కౌలుకు ఇవ్వడంతో సరోజన కూతుళ్ళు, భూపాల్ రెడ్డి మధ్య ఆస్తి తగాదాలు మరింత రాజుకున్నాయి. బుధవారం రాత్రి మరోసారి జరిగిన గొడవలో మాటామాటా పెరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన భూపాల్‌రెడ్డి తన సవతి తల్లి సరోజనను గొడ్డలితో నరికి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మృతురాలి సరోజన కూతుళ్ళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

ఈసెట్ ర్యాంకర్లకు అభినందనలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచీల్లో కోర్సులను పూర్తి చేసి ఈసెట్‌లో అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అభినందించారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో టాప్ 20 ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపకబృందంతో కలిసి జ్ఞాపికలను అందించి అభినందించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల పట్టుదలకు, అధ్యాపకుల కృషికి ఈ ర్యాంకులు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాధిపతులు పాల్గొన్నారు.

వరంగల్ డీఈవోకు అక్షింతలు

తప్పుడు ఆదేశాల జారీ... ఉన్నతాధికారుల సీరియస్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్‌కు సర్వశిక్ష అభియాన్ ఉన్నతధికారుల నుంచి బుధవారం రాత్రి అక్షింతలు పడినట్లు తెలిసింది. విద్యా సంవత్సరం ముందు రోజు ఆయన తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణం. జిల్లాలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లను విధుల్లోకి తీసుకోవద్దంటూ ఎంఈవో, హెడ్మాస్టర్ల వాట్సాప్ గ్రూపుల్లో జ్ఞానేశ్వర్ వాయిస్ మెసేజ్ పంపించారు. వాస్తవానికి ఈ నెల 6వ తేదీనే వారిని పాఠశాలల ప్రారంభం రోజు రీ ఎంగేజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కానీ దానికి విరుద్ధంగా వరంగల్ డీఈవో వాయిస్ రికార్డు రూపంలో ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న 63 మంది పీటీలు ఆందోళన చెంది సమగ్ర శిక్ష ఉన్నతాధికారులను సంప్రదించారు. ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. పీటీలను రీఎంగేజ్ చేసుకోవాలనే ఉత్తర్వులే తప్ప మరే లాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమగ్ర శిక్షలోని ఓ ఉన్నతాధికారి కూడా స్పష్టం చేశారు. ఈ విషయం రాష్ట్రంలోని ఇతర జిల్లాల విద్యాశాఖ, ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో డీఈవో తీరును తప్పుబడుతూ సమగ్రశిక్ష ఉన్నతాధికారి ఫోన్‌లోనే అక్షింతలు వేసినట్లు తెలిసింది. దీంతో జిల్లాలో గత ఏడాది పనిచేసిన పీటీలను రీ ఎంగేజ్ చేసుకోవాలని మరోసారి సంక్షిప్త సందేశాలను వాట్సాప్ గ్రూపుల్లో పంపించారు.

టైరు పేలి.. చెట్టును ఢీకొట్టి..

కారు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మృతులు ఎల్‌బీనగర్, చింతల్ వాసులుగా గుర్తింపు



వసంతాపూర్ వద్ద టైర్ పేలడంతో చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు

గీసుగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మండలం వసంతాపూర్ శివారులో కారు టైర్ పేలిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. వరంగల్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎమ్డీ. షోయబుద్దిన్(18), చింతల్‌కు చెందిన షేక్ అహ్మద్ (18) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీ నగర్‌కు చెందిన షోయబుద్దిన్, సమీర్‌పాష, చింతల్‌కు చెందిన టేక్ అహ్మద్, జాన్‌పాకకు చెందిన ఇస్మాయిల్ నలుగురూ స్నేహితులు. వీరు సంగెం మండలం వెంకటాపూర్‌కు కారులో వెళ్లారు. అక్కడ పని ముగించుకొన్న అనంతరం వారు వసంతాపూర్ మీదుగా వరంగల్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో కారు వెనక టైర్ అకస్మాత్తుగా పేలి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొని పల్టీలు కొడుతూ పడిపోయింది. దీంతో కారులో వెనుక కూర్చున్న షేక్ అహ్మద్, అమీన్‌నుద్దిన్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. ముందు కూర్చున్న సమీర్‌పాష, ఇస్మాయిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ప్రశాంత్ చేరుకొని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమా ర్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.



షేక్ అహ్మద్ (ఫైల్)

పండ్ల తోటల పెంపకంతో పండగే

- పైసా ఖర్చు లేకుండా ఈజీఎస్ ద్వారా సాగు
- మూడేళ్ల పాటు ఆర్థిక చేయూత
- జిల్లాలో 700 ఎకరాల్లో పెంపకమే లక్ష్యం
- ఇప్పటికే 370 ఎకరాలు గుర్తింపు
- డ్రాగన్ ఫ్రూట్‌కు యమ డిమాండ్
- ఉత్సాహంగా ముందుకు వస్తున్న రైతులు



పండ్ల తోటల సాగులో భాగంగా పండించిన డ్రాగన్ ఫ్రూట్స్

హనుమకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగు చేయాలనుకునే రైతులకు తీపి కబురు. ఉపాధి హామీ పథకం కింద ఈ పంటల సాగుకు ప్రభుత్వం సాయం చేయనున్నది. ఇప్పటికే పలువురు రైతులు పంటలు సాగు చేస్తుండగా, సాగు లక్ష్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పండ్ల ఉత్పత్తి జరగకపోవడంతో భారీగా ధరలు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో నయాపైసా ఖర్చు లేకుండా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. మార్కెట్లో పండ్లకు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది రైతులు పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ నేపథ్యంలో అటువంటి రైతులకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పండ్ల తోటల పెంపకం పథకానికి జిల్లాలో మూడేళ్లుగా మంచి స్పందన లభిస్తోంది. సన్న, చిన్నకారు రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ప్రతీ మండలానికి గరిష్ఠంగా 50 ఎకరాల చొప్పున సాగు లక్ష్యాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికే చాలా మంది రైతులు సాగుకు ముందుకు వచ్చారు. ఈ యేడు జిల్లాలో 700 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు.



రైతులు పెంచుతున్న సీతాఫలం మొక్కలు

భారీగా ప్రోత్సాహకాలు

ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు భారీగా ప్రోత్సాహకాలను అందజేస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉద్యానవన శాఖ, పంచాయతీరాజ్ శాఖ సహకారంతో, ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఉద్యానవన పంటల సాగుపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. సంప్రదాయ పంటల స్థానంలో పండ్ల తోటల పెంపకం వల్ల కలిగే లాభాలను గుర్తించిన రైతులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. వర్షాకాలం ప్రవేశించడంతో అర్హులైన రైతులను గుర్తించే పనిలో డీఆర్‌డీఏ అధికారులు ఉన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తోటల పెంపకం చేపడితే చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం ఇచ్చే పండ్లు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రాయితీలు ప్రకటించింది. మామిడి తోటల సాగు, ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. జిల్లాలో రైతులు డ్రాగన్ ఫ్రూట్ పెంపకానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

పండ్ల మొక్కల ధరలు

ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల మొక్కలకు నిర్ణయించిన మేరకు ధరలను రైతులకు చెల్లిస్తారు. మార్కెట్‌లో రైతులు తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసుకోవచ్చు. వాటి ధర ఎక్కువ ఉంటే ఆ మేరకు కొనుగోలు చేసినా ప్రభుత్వం నిర్ణయించిన ధరనే చెల్లిస్తుంది. మిగతాది రైతులే భరించాల్సి ఉంటుంది. రవాణా ఖర్చుతో కలుపుకొని మామిడికి రూ.50, సీతాఫలంకు రూ.60, చింతకు రూ.60, డ్రాగన్‌ఫ్రూట్‌కు రూ.45, నిమ్మకు రూ.30, జామాయిల్‌కు రూ.40. కరొండకు రూ.20, నేరేడు రూ.60, బత్తాయికి రూ.110, కొబ్బరికి రూ.70, దానిమ్మకు రూ.45, సపోటకు రూ.60, మునగకు రూ.25, జీడిమామిడికి రూ.24, పెద్ద రేగుకు రూ.51, పామాయిల్‌కు రూ.20 చొప్పున ఒక్కో మొక్కకు చెల్లిస్తారు. ఆయా పండ్ల తోటల పెంపకానికి ఒక ఎకరానికి మామిడి 70, బత్తాయి 100, సపోట 60, కొబ్బరి 110, జామ 110, డ్రాగన్ ఫ్రూట్ 900, సీతాఫలం 100, నిమ్మ 110, అల్లనేరేడు 40, దానిమ్మ 265, మునగ 1000, ఆయిల్ పామ్ 57 మొక్కలు అవసరమవుతాయి.



పొలం గట్లపై నాటిన కొబ్బరి మొక్కలు

పండ్ల తోటల పెంపకమే లక్ష్యం

జిల్లాలో ఈ ఏడు 700 ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 334.55 ఎకరాలను గుర్తించారు. ఇందుల్లో పండ్ల తోటలను పెంచేందుకు 174 మంది రైతులు ముందుకు వచ్చారు. మిగతా 365.45 ఎకరాలను త్వరలో గుర్తిస్తారు. ఆత్మకూరు మండలంలో 60 ఎకరాలు, భీమదేవరపల్లిలో 75 ఎకరాలు, దామెరలో 52 ఎకరాలు, ధర్మసాగర్‌లో 65 ఎకరాలు, ఎల్కతుర్తిలో 65 ఎకరాలు, హసన్‌పర్తిలో 50 ఎకరాలు, ఐనవోలులో 60 ఎకరాలు, కమలాపూర్‌లో 60 ఎకరాలు, నడికూడలో 50 ఎకరాలు, పరకాలలో 38 ఎకరాలు, శాయంపేటలో 75 ఎకరాలు, వేలేరులో 50 ఎకరాల్లో తోటలను పెంచాలన్నది లక్ష్యం.



మాణిక్యాపూర్ గ్రామంలో చేపట్టిన మామిడి తోటల పెంపకం

ఈజీఎస్ కింద..

ఈజీఎస్ కింద ఒక్కో ఉద్యానవన పంటకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. మునగ ఒక ఎకరం, మిగతా పంటలకు అయిదేసి ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చు. ఈజీఎస్ కింద కూలీల వేతనం, మెటీరియల్ కలుపుకొని మొత్తం ఖర్చు మునగ రూ.1,01,899, మామిడి రూ.64,864, జీడిమామిడి రూ.64,864, సపోట రూ.56,661, జామా రూ.38,996, ఆయిల్‌పామ్ రూ. 53,078, చింత రూ.38,996, కొబ్బరి బ్లాక్ రూ.1,25,127, కొబ్బరి బండ్ రూ. 48,173, బత్తాయి రూ.76,244, నిమ్మ రూ.81,306, జామ రూ.81,973, సీతాఫలం రూ.1,16,376, నారింజ రూ.1,89,258, ఆపిల్ బేర్ రూ.1,20,418, కొరండ బండ్ రూ.1,14,600, డ్రాగన్ ఫ్రూట్ రూ.2,69,129. పండ్ల తోటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల పాటు సాయం అందించనున్నది. మూడేళ్ల తర్వాత పంట చేతికి వస్తుంది. చేతికి వచ్చిన పంటలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వమే కల్పిస్తుంది. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వేందుకు రూ 233.32, మొక్కలు నాటేందుకు రూ. 43.53 జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. అలాగే మొక్కలు ఎదిగేలా నీటిని అందించేందుకు సైతం ఆర్థికంగా చేయూతనిస్తుంది.

ఎవరు అర్హులు అంటే ?

ఉపాధి కూలీలుగా నమోదు చేసుకున్న అయిదు ఎకరాల భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. ఉపాధి హామీ జాబ్ కార్డు తప్పనిసరి. జాబ్‌కార్డు లేనివారు కూడా ముందుకు వస్తే వారికి అధికారులు కార్డు ఇప్పిస్తారు. అయిదెకరాల్లోపు ఉన్న సన్నకారు రైతులు అర్హులు. ముఖ్యంగా సాగునీటి వసతి ఉండాలి. తోటలు పెంచేందుకు బిందు సేద్యంపై రాయితీ ఇస్తారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, మిగతా వారికి 90 శాతం రాయితీపై పరికరాలు ఇవ్వనున్నారు. పండ్ల తోటలను పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులు స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

'ఉపాధి హామీ'లో ఏ తోటలంటే..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జామ, మునగ, సీతాఫలం, సపోటా, బత్తాయి, అల్లనేరేడు, నారింజ, ఆయిల్‌పామ్ తోటలు బ్లాక్ ప్లాంటేషన్, గట్లపై పెంచేందుకు నేరేడు, కొబ్బరి, చింత, సీతాఫలం తోటల పెంపకానికి రాయితీలు ఇవ్వనున్నారు. పండ్ల తోటల సాగు కోసం గుంతలు తీయడం, మొక్కల కొనుగోలు, వాటిని నాటడానికి ఊతకర్రలు కట్టడానికి, ఎరువులకు నెలనెలా పర్యవేక్షణకు మూడేళ్ల పాటు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు ఇస్తారు. అలాగే ఆయిల్‌పామ్‌కు బిందు సేద్యం సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నది.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం
- గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ఏటూరునాగారంలో రూ. 4.20 కోట్లతో బస్ డిపోకు శంకుస్థాపన

ఏటూరునాగారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల భవనంలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పాఠశాల యూనిఫామ్‌లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఏటూరునాగారం ప్రభుత్వ పాఠశాలకు ఇప్పటికే 10 కంప్యూటర్లను అందజేయడం జరిగిందని, రానున్న రోజుల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మరో 150 కంప్యూటర్లు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె వెల్లడించారు.



విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న చేస్తున్న మంత్రి సీతక్క

గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం

మారుమూల గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురంలో రూ. 4 కోట్ల 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న బస్ డిపో నిర్మాణ పనులకు ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయలతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఏటూరునాగారంలో బస్ డిపోతో పాటు రూ. 50 లక్షలతో మంగపేట మండలంలో బస్టాండ్ నిర్మాణం, కలెక్టరేట్‌కు వచ్చేవారి సౌకర్యార్థం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ప్రాంతంలో బస్టాండ్ మంజూరు చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గోవిందరావుపేట మండలం పసర సమీపం నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని టేకులగూడెం వరకు రూ. 400 కోట్లతో జాతీయ రహదారి మంజూరైందని, త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ములుగు జిల్లా కేంద్రానికి సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో బస్సు డిపోలు ఉన్నాయని, ఏటూరునాగారంలో బస్ డిపో ఏర్పాటు చేయడం ద్వారా ములుగుతో పాటు ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. మంజూరైన బస్ డిపో, మంగపేటలో బస్టాండ్ నిర్మాణ పనులను మేడారం జాతర నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రజా ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్లను సైతం మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం, మంగపేట మండలాలకు చెందిన నిరుపేదలకు ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి మంజూరైన పత్రాలను మంత్రి అందజేశారు.

కార్యక్రమంలో ములుగు అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీవో సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎం కిరణ్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడ చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, ఎమ్డీ. ముజామిల్, వావిలాల చిన్నఎల్లయ్య, ఎమ్డీ. గౌస్, ఖలీల్ ఖాన్, సరికొప్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఏటూరునాగారంలో 'అమ్మ మాట- అంగన్వాడీ బాట' కార్యక్రమాన్ని సీతక్క ప్రారంభించింది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే లక్ష్యమని మంత్రి అన్నారు.

గిరిజన సంప్రదాయాలకు పెద్దపీట

- ఎమ్మెల్యే శ్రీహరి
- సీతాతండాలో ట్రైబల్ మ్యూజియానికి స్థల పరిశీలన



సీతాతండాలో ట్రైబల్ మ్యూజియం కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

చిలుపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని దేశాయితండా పరిధి సీతాతండాలో ఏర్పాటు చేయనున్న గిరిజన ఆదృకళా మ్యూజియం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు, కళలను భావితరాలకు అందించడంలో మ్యూజియాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. మ్యూజియం ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకెళ్లి అత్యధిక నిధులు మంజూరు చేయిస్తానన్నారు. డీపీఆర్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు చిన్నపెండ్యాలలో అగ్రిమాల్‌ను ప్రారంభించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న 'అమ్మమాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ జే తిరుమల్‌రావు, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పీ శ్రీధర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, పోలెపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, మాజీ సర్పంచ్‌లు లింగారెడ్డి, సమ్మయ్య, దామోదర్, యాదవరెడ్డి, సంపత్‌కుమార్, నాయకులు రాజ్‌కుమార్, హరిబాబు, బుచ్చికొమురయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ అబద్ధాలు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టి. శ్రీనివాసరావు

మహబూబాబాద్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లోపంపై పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ సీఎం కేసీఆర్ అన్ని అబద్ధాలే చెప్పారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. మహబూబాబాద్‌లోని వీరభవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో 'కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇంజనీర్‌ను నేనే... మేస్త్రీని నేనే'... అని చెప్పుకున్న కేసీఆర్... అది కూలిపోయే సమయంలో తనకేమీ సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్ణయం క్యాబినెట్‌ది... నిర్వహణ అధికారులదని చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రూ.లక్ష కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి కాళేశ్వరం నిర్మించారని తద్వారా ఎకరం భూమికి చుక్క నీరివ్వలేదని మండిపడ్డారు.

మావోయిస్టులు పంథా మార్చుకోవాలి

మావోయిస్టులు తమ పంథాను మార్చుకుని తుపాకి ద్వారా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మావోయిస్టులు, కమ్యూనిస్టులు ఏకమై ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో అమాయక గిరిజనులను ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపుతున్నారని ఇది సరియైన విధానం కాదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బీ విజయసారథి, జిల్లా సహాయ కార్యదర్శులు బీ అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశల గల్లంతు

(5వ పేజీ తరువాయి)

చేయడం వివాదంగా మారింది. రూ.50వేల రుణం తీసుకుంటే ప్రభుత్వం 100శాతం రాయితీ ఇస్తుంది. అలాంటప్పుడు సిబిల్ స్కోర్ ఎందుకని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గరిష్ఠంగా రూ.4లక్షల రుణం తీసుకున్నప్పటికీ ప్రభుత్వం 70శాతం రాయితీ అంటే రూ.2.80లక్షల మాఫీ చేస్తుంది. ఇక బ్యాంకుకు చెల్లించాల్సింది కేవలం రూ.1.20లక్షలే. సిబిల్ స్కోర్ పేరుతో చాలామంది దరఖాస్తులు తొలగించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ములుగు జిల్లాలో 3,518మంది దరఖాస్తు చేసుకుంటే.. వివిధ కారణాలతో 1,459మంది దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా ప్రతీ జిల్లాల్లో 30శాతం నుంచి 45శాతం వరకు దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. వీటితో పాటు గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు తీసుకున్నప్పటికీ, తిరిగి వారిని కొన్ని చోట్ల అధికారులు ఎంపిక చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని ప్రభుత్వం భావిస్తున్న క్రమంలోనే యువవికాసం ప్రొసీడింగ్స్ పంపిణీని నిలిపి వేసిందనే ప్రచారం ఉంది.

మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. వీటితో పాటుగా అత్యధికంగా దరఖాస్తులు 4వ గ్రేడ్‌లోని రూ.4లక్షల రుణం కోసం రావటం.. ఆ యూనిట్లు తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక సమస్యగా మారినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యేలపై గ్రేడ్-4 యూనిట్ల కోసం కేడర్ నుంచి ఒత్తిడి వస్తుండటంతో అధికారులకు సిఫార్సులు పెరిగినట్లుగా సమాచారం. దీంతో ఒకరికి ఇచ్చి, మరొకరికి ఇవ్వకుండా కేడర్ దూరమవుతుందనే ఆందోళనతో ప్రజాప్రతనిధుల నుంచి వ్యక్తమైనట్లుగా తెలిసింది. అన్ని పరిశీలించాలకే ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకం ప్రొసిడింగ్స్ పంపిణీ వాయిదా వేసిందనే చర్చ జరుగుతోంది.

స్థానిక ఎన్నికల కోసమే వాయిదా ?

జూలై, ఆగస్టు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో యువవికాసం పథకం ద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే ప్రచారం కూడా ఉంది. దరఖాస్తుల భారీగా రావటం.. యూనిట్లు తక్కువగా ఉండటంతో, రుణం అందని నిరుద్యోగ యువత నుంచి వ్యతిరేకత వస్తుందనే ఆందోళనలో ప్రభుత్వం ఉంది.

ఉదాహరణకు ములుగు జిల్లాలో బీసీల నుంచి 1,855మంది దరఖాస్తు చేసుకుంటే 102 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఎస్టీలు 838మంది దరఖాస్తు చేసుకుంటే 271 యూనిట్లే మంజూరు అయ్యాయి. రుణసాయం అందని నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు రాజీవ్ యువవికాస్ పథకాన్ని నిలిపి వేయటమా? లేక మరిన్ని యూనిట్లను పెంచి అర్హులైన అందరికీ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కార్యాచరణ రూపొందించటమా? అనే దానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే ప్రచారం ఉంది.

భూగర్భ జలాల పెంపు భేష్

రాఘవపురం గ్రామాన్ని కేంద్ర బృందం సందర్శన



రాఘవపురం గ్రామంలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకుర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా పాలకుర్తి మండలం రాఘవపురం గ్రామాన్ని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. కేంద్ర జలశక్తి పురస్కారాల కోసం దేశవ్యాప్తంగా గ్రామాలను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా జనగామ జిల్లా పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామాన్ని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ శాస్త్రవేత్త వీ యాదయ్య, కేంద్ర నీటి కమిషన్ సబ్ డివిజనల్ ఇంజనీర్ డీ చైతన్య సందర్శించారు. పదేళ్లలో భూగర్భ జలాలను పెంచడానికి చేపట్టిన పనులను కేంద్ర బృందం పరిశీలించింది. గ్రామంలో అధికారులు జలశక్తి పురస్కారానికి ప్రామాణికమైన అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా యాదయ్య, చైతన్య మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ నిధులతో 120 నీటి కుంటలు, 2 చెక్ డ్యామ్‌లు, 2 చెరువుల్లో మట్టి తీసి నీటి సామర్థ్యం పెరుగుదలకు చేపట్టిన అభివృద్ధి పనులు భేషుగ్గా ఉన్నాయన్నారు. దేశంలోనే 30 గ్రామాలను ఎంపిక చేశామని తెలంగాణలో జనగాం జిల్లా పాలకుర్తి మండలంలోని రాఘవాపురం గ్రామం ఎంపికైనట్లు తెలిపారు. గ్రామంలో వంద శాతం ఇంకుడుగుంతలు, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిన గ్రామం అని దీనిని పరిశీలించేందుకు సందర్శించామని పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టిన ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలించామని తెలిపారు. నివేదికను కేంద్ర భూగర్భ జలవనరుల శాఖకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట డీఆర్‌డీవో పీడీ వసంత, ఎంపీడీవో ఆవుల రాములు, ఏపీవో మంజుల, ఎంపీవో రవీందర్, కార్యదర్శులు కే వెంకటేశ్వచారి, యుగేంధర్, శిరీష, మహేందర్, మహేశ్, లింగయ్య, ప్రియాంక తదితరులు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి అభియాన్ పథకంలో భాగంగా అమలు అవుతున్న వివిధ పనులను జలశక్తి అభియాన్ టీమ్ సభ్యుడు, శాస్త్రవేత్త వెంకటగిరి గురువారం అక్కపల్లిగూడెం, రంగరాయగూడెం, ఇప్పగూడెం, మీదికొండ గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా భూగర్భ జలాలను పెంచడంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ సోఫిట్, మాజిక్ సోఫిట్, లూజ్, బోల్డ్ స్ట్రక్చర్స్ గ్యాబిన్ స్ట్రక్చర్లు, చెక్ డ్యామ్ పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, సెక్రటరీలు భరత అవినాష్, నరేష్, ఇర్ఫాన్, వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి వీరన్న, ఏపీవో ప్రేమయ్య, టీఏ జాంబ, ఫీల్డ్ అసిస్టెంట్ మందపురం కవిత తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్‌లు

మహదేవపూర్/ మహదేవపూర్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌లు గురువారం పర్యటించారు. ముందుగా కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర అంతరాష్ట్ర వంతెనను పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని సందర్శించారు. ఈ బృందంలో సౌరబ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్, చింగ్తయానమావి, కొయ్యడ ప్రణయ్ కుమార్‌తో పాటు మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, లైసన్ ఆఫీసర్ అబ్బాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

రేపటి ఆపరేషన్ కగార్ వ్యతిరేక ర్యాలీకి రండి

- కొండా మురళీధర్‌రావును కోరిన వామపక్షాల నాయకులు

గిర్మాజిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 14న వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు సాగే ఆపరేషన్ కగార్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొనాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును వామపక్ష నాయకులు ఆహ్వానించారు. గురువారం హనుమకొండలోని స్వగృహంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, భారత్ బచావో నాయకులు ఎం.వెంగల్‌రెడ్డి, ఓంబ్రహ్మం, రాజ్‌మహ్మద్‌లు కలిశారు. మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు 500లకు పైగా ఆదివాసీలు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చిందని వివరించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా తాము పట్టే ర్యాలీకి హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు

- వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠంలో ప్రారంభం

వరంగల్ కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వార్షికోత్సవాలను పురస్కరించుకుని ప్రతీ ఏటా నిర్వహించే జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు శుక్రవారం నుంచి నగరంలోని పోతన విజ్ఞాన పీఠంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కాకతీయ నృత్య కళాక్షేత్రం డాక్టర్ వెంపటి శ్రావణి శిష్య బృందంచే స్వాగత నృత్య ప్రదర్శన ఉంటుంది. అనంతరం రాత్రి 7.30 గంటలకు మొదటి రోజు చిలుకలూరిపేట వారి 'మా ఇంట్లో మహా భారతం' నాటక ప్రదర్శన జరుగుతుందని, తదుపరి నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత నిజామాబాద్‌కు చెందిన కళాకారులచే తన్మయ ఆర్ట్స్ వారిచే చదువు నాటిక ప్రదర్శింప బడుతుందని అన్నారు. కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు, ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొని నాటకాలను ఆసాంతం వీక్షించగలరని కాజీపేట తిరుమలయ్య తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

మట్టెవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 26 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ గురువారం రూ.25,600 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఏడుగురు వ్యక్తులకు రూ.3వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు.

'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' నిర్వహించాలి



రామన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో రాజ్యలక్ష్మి

వరంగల్ చౌరస్తా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్ ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని డీడబ్ల్యూవో రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎక్కువగా కార్యక్రమాలను నిర్వహించాలని డీడబ్ల్యూవో సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విద్య, సూపర్‌వైజర్ ఛాయాదేవి, అంగన్‌వాడీ టీచర్ సమత, హెల్పర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెట్ల నరికివేత

వరంగల్ చౌరస్తా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రామన్నపేటలోని పోతన రోడ్డులో గల మోక్షారామం ఫౌండేషన్ వారిచే నిర్వహించబడుతున్న శ్మశానవాటికలోని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. నిరుపయోగంగా ఉన్న శ్మశానవాటికను 9 సంవత్సరాల క్రితం మోక్షారామం ఫౌండేషన్ దత్తత తీసుకొని దాదాపు రూ.50 లక్షలతో అభివృద్ధి పర్చి ఉద్యాన వనంలా తీర్చిదిద్దారు. అనేక వేప చెట్లు, పూల చెట్లు, పండ్ల చెట్లను పెంచడంతో వృక్షాలుగా మారాయి. ప్రకృతి పర్యావరణ రక్షణగా మంచి ఆక్సిజన్ రావాలని చెట్లను పెంచగా బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. ప్రహరి గోడను కూల్చివేశారని, ప్రజలకు ఉపయోగపడే శ్మశానవాటిక వద్ద ఇలాంటి అరాచక కార్యక్రమాలు చేయడం ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని మోక్షారామం ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి శిక్షించాలని అధికారులను కోరారు.

రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గిర్మాజిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న రైలులో నుంచి బుధవారం రాత్రి ఎల్గూరు రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో ప్రమాదవశాత్తు గుర్తుతెలియని ప్రయాణికుడు(37) జారిపడి మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రైలు ట్రాక్ పక్కన చెట్ల పొదల్లో ప్రయాణికుడి మృతదేహం కనిపించిందని చెప్పారు. మృతుడు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, చామన ఛాయ దేహవర్ణం, గుండ్రని ముఖం, వీపుపై పుట్టుమచ్చ కలిగి, నలుపు రంగు తల వెంట్రుకలు, గడ్డంతో నలుపు రంగు జీన్స్ ప్యాంటు, బ్రౌన్ రంగు ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుడి వద్ద కాజీపేట నుంచి నెక్కొండకు బుధవారం సాయంత్రం 5 గంటల తరువాత కాజీపేట రైల్వేస్టేషన్‌లో కొనుగోలు చేసిన జనరల్ టికెట్ దొరికిందని సీఐ తెలిపారు. మృతుడు నెక్కొండ పరిసరాలకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తూ ఆ మేరకు విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చగా, హెడ్ కానిస్టేబుల్ కె.భాస్కర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు వరంగల్ జీఆర్పీ 9440361941/8712658585 నంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

అభివృద్ధికి నోచుకోని తెలంగాణ జంక్షన్

- ఇరుకు మలుపులు.. నో సిగ్నల్స్.. అస్తవ్యస్తంగా ట్రాఫిక్..
- టూ వీలర్ నుంచి భారీ కంటైనర్ల రాకపోకలతో నిత్యం రద్దీ
- భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్‌కు వెళ్లేందుకు కీలక జంక్షన్



ట్రాఫిక్ సిగ్నల్స్ లేని తెలంగాణ జంక్షన్



జంక్షన్‌లో టర్న్ కాలేకపోతున్న లారీ

గిర్మాజిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంతో భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్ రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానమైన తెలంగాణ జంక్షన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. జంక్షన్‌లో సిగ్నల్స్ లేకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే తెలంగాణ జంక్షన్ నలుమూలలు ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాల టర్నింగ్ కత్తి మీద సాముగా మారిందనే ఆందోళన వాహనదారుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ క్యాంపు కార్యాలయం ఓ సిటీకి కూతవేటు దూరంలో ఉన్నా తెలంగాణ జంక్షన్ విస్తరణ, అభివృద్ధిపై అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల పాలిట ప్రాణాంతకంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.

వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్లే మార్గంలో చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని అనుసంధానించే ప్రాంతమే తెలంగాణ జంక్షన్. నూతనంగా నిర్మాణమవుతున్న జిల్లా కలెక్టరేట్ భవన సముదాయానికి ఆనుకుని ఉన్న ఈ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. వరంగల్-నర్సంపేట వరకు నిత్యం ప్రజలు వాహనాల్లో రాకపోకలు చేస్తుంటారు. రాష్ట్ర రహదారిలో నుంచి నర్సంపేట మీదుగా భద్రాచలం వైపు, వరంగల్ నుంచి చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా తొర్రూరు, ఖమ్మం వైపు ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్లు, భారీ కంటైనర్లు, ఆయిల్ ట్యాంకర్లు ఇలా.. అన్ని రకాల వాహనాలు తెలంగాణ జంక్షన్ నుంచే వెళ్తుంటాయి. నర్సంపేట నుంచి వరంగల్ సిటీలోకి రాకుండా హైదరాబాద్ వెళ్లేందుకు ఈ జంక్షన్ నుంచే చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా నాయుడు పెట్రోల్ పంపు జంక్షన్ నుంచి ఉర్సు గుట్ట మీదుగా కాజీపేట మెయిన్ రోడ్డుకు చేరుకుంటాయి. అలాగే ఖిలావరంగల్, రంగశాయిపేట ప్రజలు నర్సంపేట వైపు తెలంగాణ జంక్షన్ నుంచే వెళ్తుంటారు. వరంగల్ రైల్వేగూడ్స్ షెడ్డు సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపో నుంచి నర్సంపేట, ఖమ్మం, హైదరాబాద్ వెళ్లేందుకు ఆయిల్ ట్యాంకర్లు, భారీ కంటైనర్లు సైతం తెలంగాణ జంక్షన్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి.

ఇరుకు మలుపులు.. నో ట్రాఫిక్ సిగ్నల్స్..

తెలంగాణ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో రవాణా అస్తవ్యస్తంగా మారుతోంది. వరంగల్, నర్సంపేట, చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వైపుల నుంచి వచ్చే అన్ని వాహనాలు సిగ్నల్స్ లేక ఎదురెదురుగా ఢీకొనే పరిస్థితులున్నాయి. ఈ జంక్షన్ మూడు వైపులా ముఖ్యంగా ఖిలావరంగల్ వైపు ఉన్న సర్వీసు రోడ్డు ఆక్రమణకు గురికావడంతో ఖిలావరంగల్ వైపు వెళ్లే అన్ని రకాల వాహనాలు టర్నింగ్ అయ్యేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఖిలావరంగల్, ఖమ్మం నుంచి నర్సంపేట వైపు వెళ్లే భారీ వాహనాలు టర్నింగ్ తీసుకోవడం కూడా ఇబ్బందికరంగా మారిందని స్థానికులు అంటున్నారు. వాహనదారులు ఇష్టం వచ్చినట్లు వస్తుండడంతో ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ పోలీసులు పరుగులు తీస్తూ వాహనాలను క్రమబద్ధీకరించడం నిత్యం కృత్యంగా మారిందని అంటున్నారు.

వరంగల్ మహా నగరంలోని జంక్షన్‌లను లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కుడా అధికారులు మంత్రి క్యాంపు కార్యాలయం సమీపంలోని తెలంగాణ జంక్షన్ అభివృద్ధిని పట్టించుకోక పోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. వరంగల్ నగరంలో అత్యంత కీలకమైన తెలంగాణ జంక్షన్‌ను నలువైపులా విస్తరించడంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్, ఆర్టీసీ బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని స్థానిక శాసనసభ్యురాలు, మంత్రి కొండా సురేఖను స్థానిక ప్రజలు, పలువురు వాహనదారులు కోరుతున్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

- మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



రంగశాయిపేటలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మామునూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్‌లోని సత్యనారాయణ కాలనీ, రంగశాయిపేటలో 100 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని గృహాల యజమానులు తమ వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను వేరుగా చేసి అందించాలని సూచించారు. తడి చెత్తను ఇంటిలోనే మెన్యూర్(ఎరువు)గా తయారుచేసుకుని మొక్కలకు ఉపయోగించుకోవాలన్నారు. తద్వారా చెత్త పరిమాణాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ఆమె వివరించారు. ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలను వేరు చేసి పరిశ్రమలకు పంపించడం జరగుతుందని, చెత్తను డ్రైనేజీలలో వేయడం వలన దోమల వ్యాప్తికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

గీసుగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మచ్చాపూర్ అపెక్స్ కళాశాల సమీపంలో వరంగల్-నర్సంపేట ప్రధానరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి వేముల రవీందర్‌రెడ్డి భార్య మమత, కూతురు విద్య, తల్లి ఏలేంద్ర, తండ్రి రామచంద్రారెడ్డితో కలిసి కారులో ముత్తోజిపేటకు బంధువుల ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి వరంగల్ వైపు మిర్చి లోడుతో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వేగంగా కారును ఢీకొంది. దీంతో అందులో ఉన్న రవీందర్‌రెడ్డి, మమత, విద్య, ఏలేంద్ర, రామచంద్రారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌రెడ్డి బావమరిది గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం త్వరితగతిన చెల్లించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి ఇన్నర్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రాజీవ్ మెగా టౌన్‌షిప్ లే ఔట్ అనుమతుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటులో గొర్రెకుంట, ఏనుమాముల, ఖిలావరంగల్, ఉర్సు ప్రాంతాలకు చెందిన భూ నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం వెంటనే అందజేయాలన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వం భూ పట్టాలు అందజేసిన 863 మందికి రాజీవ్ మెగా టౌన్‌షిప్ ఏర్పాటు నిమిత్తం వెంటనే లే ఔట్ అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కేఎంటీపీ జోనల్ మేనేజర్ స్వామి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, కుడా పీవో అజిత్‌రెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, మహ్మద్ ఇక్బాల్, రియాజుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

మామునూరు: వరంగల్ మామునూరు విమానాశ్రయంలో రోడ్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి మామునూరు విమానాశ్రయంలో రోడ్లు నిర్మాణం చేసే ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గుంటూరుపల్లి నుంచి నేషనల్ హైవే వరకు, నక్కలపల్లి నుంచి గాడిపల్లి-గాడిపల్లి బైపాస్ వరకు త్వరితగతిన ఏర్పాటు చేయనున్న తదితర రోడ్ల స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి పంపడానికి త్వరితంగా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రోడ్లు, భవనాల శాఖ అధికారి రమేష్, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెలిగ్రాఫ్ యాప్ ద్వారా చాటింగ్

- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.1.93 లక్షలు స్వాహా

మట్టెవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి గుర్తుతెలియని మహిళ టెలిగ్రాఫ్ యాప్ ద్వారా పరిచయమై చాటింగ్ చేసింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పడంతో సదరు ప్రైవేటు ఉద్యోగి రూ.1.93 లక్షలు ట్రేడింగ్‌లో పెట్టి మోసపోయిన సంఘటన వరంగల్ జిల్లాకేంద్రంలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్‌లోని వాసవికాలనీకి చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగికి గుర్తుతెలియని మహిళ పరిచయమైంది. టెలిగ్రాఫ్ ద్వారా చాటింగ్ చేస్తూ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని చెప్పడంతో నమ్మిన ఆ ఉద్యోగి ఫోర్ ఎక్స్ ట్రేడింగ్ అకౌంటును గత మే 12న ఓపెన్ చేసి మొదటి విడతగా రూ.21,250 పెట్టుబడి పెట్టాడు. ఎలాంటి లాభం రాలేదని సదరు గుర్తుతెలియని మహిళకు చెప్పడంతో పెద్ద మొత్తంలో డబ్బులు పెడితే వస్తాయని తెలిపింది. దీంతో ప్రైవేటు ఉద్యోగి రెండో విడతగా రూ.78వేలు, మూడో విడతగా రూ.94,350 జమ చేశాడు. మొత్తం రూ.1,93,600 ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టారు. ఎలాంటి లాభాలు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

భర్తపై భార్య బంధువుల దాడి

- గొంతుకు తీవ్రగాయం.. ఎంజీఎంలో చేరిక



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కబీర్

వరంగల్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండిబజార్‌కు చెందిన ఓ యువకుడిపై భార్య తరపు బంధువులు బుధవారం అర్ధరాత్రి చేసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ తెలిపిన ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఇబ్రహీంపల్లికి చెందిన కబీర్ హుల్ రెహమాన్(40)కు వరంగల్ మండిబజార్‌కి చెందిన హీనా తస్లీమాతో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. వివాహం అయిన ఆరు నెలల నుంచి కబీర్ హుల్ రెహమాన్ అత్తగారింటి వద్ద ఉంటూ వెల్డింగ్ పని చేసుకుంటూ కుటుంబంతో జీవనం కొనసాగించేవాడు. కుటుంబ పోషణ నిమిత్తం కబీర్ చేసే పనికి డబ్బులు సరిపోకపోవడంతో బయటి దేశానికి వెళ్లడానికి నిర్ణయించుకున్నాడు. దీంతో కబీర్ హుల్ రెహమాన్ సౌదీకి వెళ్లాలని సిద్ధమవగా భార్య హీనా తస్లీమా దుబాయ్‌కి వెళ్లాలని కోరినట్లు సీఐ తెలిపారు. కబీర్ భార్య దుబాయ్‌కి వెళ్లాలని పట్టుబట్టడంతో కబీర్ నిరాకరించాడు. ఈ విషయంలో వీరిరువురి మధ్య కొంత కాలంగా తీవ్ర గొడవలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. దుబాయ్‌కి వెళ్తావా.. వెళ్లవా.. అని బుధవారం అర్ధరాత్రి హీనా తస్లీమా భర్త కబీర్ హుల్ రెహమాన్‌తో తీవ్రంగా గొడవ పడ్డారు. ఈ గొడవలో భార్య తస్లీమా తల్లి కౌసర్, ఆమె తరపు బంధువులు అయిన మోహిజు అలియాస్ అడ్డు, ముజీహీద్, సమీర్‌లు కలిసి కబీర్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా కొట్టగా గొంతుకు తీవ్ర గాయాలైనట్లు సీఐ తెలిపారు. అతన్ని స్థానికులు వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కాగా, తనపై భార్య తస్లీమా, ఆమె బంధువులు దాడి చేసినట్లు ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కార్పొరేటర్లు గుండు చందన, పోశాల పద్మ



రంగశాయిపేట పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్



శంభునిపేట పాఠశాలలో దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పోశాల పద్మస్వామి

శంభునిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభ వేడుకల్లో భాగంగా 42వ డివిజన్ రంగశాయిపేట, ఉర్సు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ గుండు చందన పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాంలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బోయినపల్లి సూర్యకళ, రంగశాయిపేట, ఉర్సు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు రామకృష్ణారెడ్డి, ఊటుకూరి అశోక్, డి.పూసారం, చైర్‌పర్సన్ కవిత, నళిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే 41వ డివిజన్ శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ పోశాల పద్మస్వామి విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, నోటుబుక్స్ అందించారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, చైర్మన్‌లు పాల్గొన్నారు. 35వ డివిజన్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. విద్యా రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేంద్రస్వామి, చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో ప్రతిభావంతులు కావాలి

కరీమాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే ప్రోత్సాహకాలతో ప్రతిభావంతులు కావాలని మిల్స్‌కాలనీ సీఐ రమేష్ అన్నారు. గురువారం పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు అందజేసి మాట్లాడారు. ఎస్సైలు శ్రీకాంత్, సురేష్, సిబ్బంది నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 32వ డివిజన్‌లోని ఆకారపు వీరలక్ష్మి పాఠశాలలో కార్పొరేటర్ పల్లం పద్మరవి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం సముద్రాల రాజు, ఉపాధ్యాయులు కవిత, శోభారాణి, రాధిక, శ్రీధర్, వాసుదేవ్, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కల్యాణి, సబిత, స్వరూప, లత, సునిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కరీమాబాద్ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న సీఐ

మోదీ పాలనలో భారత్‌లో గణనీయమైన అభివృద్ధి

- కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కొమురయ్య

మిల్స్‌కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నరేంద్ర మోదీ సంకల్పంతోనే దేశంలో సంక్షేమం సాకారమవుతుందని, ఆయన పాలనలో భారత్‌లో గణనీయమైన అభివృద్ధి జరుగుతుందని కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన గురువారం వరంగల్ చౌరస్తాలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కొమురయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పాలకులు 75 ఏళ్లలో చేయని అభివృద్ధిని మోదీ 11 ఏళ్లలో చేసి చూపారని కితాబిచ్చారు. బీజేపీ ప్రభుత్వంలోనే ప్రపంచ దేశాల్లో భారత్‌కు గుర్తింపు వచ్చిందన్నారు. 2014లో ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న మనం ఇప్పుడు 4వ స్థానంలో ఉన్నామన్నారు. దేశంలో 35 శాతం ఉన్న పేదరికాన్ని 5 శాతానికి మోదీ ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ మాట్లాడుతూ... ప్రపంచంలో భారత్ వ్యాపార, వాణిజ్య రంగాల్లో విశ్వగురువుగా ఎదగబోతుందన్నారు. తెలంగాణ మాత్రం తిరోగమనంలో ఉందని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పిన మాటల్లోనే తేలిపోయిందన్నారు. కేంద్రంలో మోదీ అవినీతి లేని పాలన అందిస్తుంటే రాష్ట్రంలో మంత్రులే అవినీతి పాలన కొనసాగుతుందని చెప్పకనే చెబుతున్నారన్నారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ విస్మరించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్, రాజా ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలి
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

7

'రాజీవ్ యువ వికాసం'.. నిరుద్యోగుల్లో ఎన్నో ఆశలను రేపిన పథకం. లబ్ధిదారులుగా ఎంపికై ఉపాధిని పొందవచ్చని నిరుద్యోగులు భావించారు. పథకం అమలు కోసం వేయికళ్లతో ఎదురుచూస్తూ వచ్చారు. అయితే ఈ పథకానికి ప్రభుత్వం ఆకస్మికంగా బ్రేకులు వేసింది. నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో పెట్టుబడి సాయం అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని రూపొందించిన విషయం విధితమే. గత ఏప్రిల్ 15 వరకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అధికారులు దరఖాస్తులను సైతం వడపోశారు. అర్హతలున్నవారిని ఎంపిక చేసి, జూన్ 2న రూ.50వేల, రూ.లక్ష లోపు రుణాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఇస్తామని ప్రకటించారు. అయితే ఏమైందో ఏమోగానీ, అకస్మాత్తుగా మంజూరు పత్రాల పంపిణీకి సర్కారు బ్రేక్ వేసింది. దీంతో రుణసాయం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు షాక్ గురయ్యారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పథకం అమలుకు బ్రేక్ వేసినట్టు భావిస్తున్నారు. అదే నిజమైతే మరో రెండు నెలల పాటు 'వికాసం' అలికిడి వినిపించదన్నమాట.



- మంజూరు పత్రాల పంపిణీ నిలిపివేత
- రూ.50వేలు, రూ.లక్ష యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని తొలుత నిర్ణయం
- జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని ప్రకటన
- అకస్మాత్తుగా పథకానికి బ్రేకులు వేసిన ప్రభుత్వం
- మంజూరైన యూనిట్ల కంటే ఎస్సీ, బీసీల్లో అర్హులే అధికం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,91,235 దరఖాస్తులు
- స్థానిక ఎన్నికల తర్వాత అమలు చేస్తారని అంచనా

ఆశలు గల్లంతు

రాజీవ్ యువ వికాసం అమలుకు సర్కారు బ్రేక్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజీవ్ యువవికాసం కింద రూ.50వేల నుంచి గరిష్ఠంగా రూ.4లక్షల వరకు రుణాలు అందించేందుకు నాలుగు గ్రేడ్లుగా విభజించి, రాయితీ ప్రకటించింది. రూ.50వేల వరకు 100శాతం రాయితీని ప్రకటించింది. అలాగే రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90శాతం రాయితీని, రూ.1,00,001 నుంచి రూ.2లక్షల వరకు 80శాతం రాయితీ, రూ.2,00,001 నుంచి రూ.4లక్షల వరకు 70శాతం రాయితీతో రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి వరంగల్ పరిధిలో 1,377రెవెన్యూ గ్రామాల నుంచి 1,91,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 49,276మంది దరఖాస్తులు చేసుకోగా, ఎస్టీల నుంచి 33,427, బీసీ కార్పొరేషన్ ద్వారా 95,479 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఈబీసీల నుంచి 2,806 దరఖాస్తులు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 10,015 దరఖాస్తులు, క్రిస్టియన్ మైనార్టీల నుంచి 232 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా నుంచి 48,702 దరఖాస్తులు రాగా, అతి తక్కువగా మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లా నుంచి కేవలం 3,518 దరఖాస్తులే వచ్చాయి. వివిధ రకాల విచారణల అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారులు ప్రభుత్వానికి పంపించారు.

మంజూరు పత్రాల పంపిణీకి బ్రేక్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,91,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి జూన్ 9వ తేదీ వరకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని, జూన్ 15వ తేదీ లోపు లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలుత రూ.50వేలు, రూ.లక్ష లోపు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకే మంజూరు పత్రాలు అందిస్తారని అధికారులు తెలిపారు. జూన్ 2న మంజూరు పత్రాలు అందుకునే లబ్ధిదారుల జాబితాను కూడా కొన్ని జిల్లాల్లో అధికారులు సిద్ధం చేశారు. అయితే అనూహ్యంగా ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో నిరుద్యోగులు షాక్ గురయ్యారు. ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగినట్లుగా జరుగుతున్న ప్రచారంతోనే ప్రభుత్వం వెనకడుగు వేసినట్లుగా భావిస్తున్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా కూడా లబ్ధిదారులను ఎంపిక

(మిగతా 6వ పేజీలో...)

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

జిల్లా	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఈబీసీ	మైనార్టీ	క్రిస్టియన్	మొత్తం
వరంగల్	10,490	6,031	22,972	616	3,798	66	43,973
హనుమకొండ	13,608	1,624	23,782	598	2,494	68	42,174
జనగామ	8,679	3,787	15,757	447	981	48	29,699
మహ-బాద్	8,963	18,809	18,546	579	1,766	39	48,702
భూపాలపల్లి	6,877	2,338	12,567	522	855	10	23,169
ములుగు	659	838	1,855	44	121	01	3,518
మొత్తం	49,276	33,427	95,479	2,806	10,015	232	1,91,235



మృతిచెందిన యువకులు

6

టైరు పేలి.. చెట్టును ఢీకొట్టి..

- కారు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



సరోజన (ఫైల్)

ఆస్తి తగాదాలతో హత్య

- సవతి తల్లిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు
- పెగడపల్లిలో దారుణం

6

హనుమకొండ కలెక్టర్‌గా స్నేహా శబరీష్

- సంగారెడ్డి కలెక్టర్‌గా ప్రావీణ్య బదిలీ



స్నేహా శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హనమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా స్నేహా శబరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్నేహా శబరీష్ ఇంతకుముందు హైదరాబాద్ జీహెచ్ఎంసీ అడిషినల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. కాగా, ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన పి.ప్రావీణ్య సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్

- ప్రస్తుత కమిషనర్ అశ్విని కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ



చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్ నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. కాగా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా పనిచేస్తున్న అశ్విని తానాజీ వాకడేను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ)గా బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. అశ్విని గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా గత ఏడాది మార్చి 14న వచ్చారు. నగరంలో స్మార్ట్‌సిటీ పనులతో పాటు నగరంలో వివిధ అభివృద్ధి పనులను నిర్వర్తించి తన మార్క్ చూపించారు. ఇక నూతన కమిషనర్‌గా వస్తున్న చహత్ బాజ్‌పాయ్ 2019లో సివిల్స్‌లో ఆల్ ఇండియా 59వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. శిక్షణ కాలం పూర్తి చేసిన తర్వాత నంద్యాల జిల్లా సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ గ్రేటర్ వరంగల్‌కు పోస్టింగ్‌పై వస్తున్నారు. ఆమె నేడో, రేపో విధుల్లో చేరుతారని తెలిసింది.

పాఠశాలల కళకళ

- సందడిగా మొదలైన విద్యాసంవత్సరం
- ఉత్సాహంగా తరలివచ్చిన విద్యార్థులు
- అందంగా ముస్తాబైన పాఠశాలల ప్రాంగణాలు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసిన కలెక్టర్లు



హనుమకొండ న్యూ శాయంపేట పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం సందడిగా మొదలైంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. ఊరువాడా, పట్టణం పల్లె అనే తేడా లేకుండా పిల్లలు దారుల వెంబడి బడి బ్యాగులతో పాఠశాలలకు తరలివెళ్లడం కనిపించింది. పాఠశాల ప్రాంగాణాలన్నీ కళకళలాడాయి. బడి బాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవాస ప్రాంతాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఉపాధ్యాయులు చేబూని పిల్లలను క్లాసుల్లోకి తీసుకెళ్లగా, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పువ్వులు ఇస్తూ విద్యార్థులు పాఠశాలల్లోకి అడుగిడటం కనిపించింది. కాగా, ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయగా వరంగల్ జిల్లాలో 13, హనుమకొండ జిల్లాలో 16 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఖిలా వరంగల్ మండలంలోని గుంటూరుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. హనుమకొండ జిల్లాలో న్యూశాయంపేటలోని పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కావ్య, కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు అందజేస్తుందన్నారు. అలాగే కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. వర్ధన్నపేట మండల పరిధిలోని పలు పాఠశాలల్లో డీఈవో జ్ఞానేశ్వర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయగా, హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వాసంతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణను కోరాలి..

- సూత్రధారులు, పాత్రధారుల పేర్లను బయటపెట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి సీబీఐ విచారణను కోరాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. కేంద్రంలో బీజేపీ పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీకే అరుణ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎంలో కుర్చీలో ఎన్ని రోజులు ఉంటాడో తెలియదని, ఉన్నప్పుడే కాళేశ్వరం అవినీతిలో సూత్రధారులు, పాత్రధారుల పేర్లు బయటపెట్టి విశ్వసనీయతను చాటుకోవాలన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ అవినీతిని బయటపెట్టి జైలుకు తరలిస్తామని దొంగ మాటలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్ వద్ద రూ.200 కోట్లు పట్టుబడ్డాయని మీడియాలో చూశామని, దీనిని బట్టి కాళేశ్వరం నిర్మాణంలో ఎవరెవరికి ఎంత వాటా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. 3 పర్యాయాలు ప్రధాని మోదీని ఒప్పించి రాష్ట్రానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తుంటే.. అభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నాడని సీఎం విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక దేశంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులు, రైల్వే మార్గాలు, ప్రాజెక్టులు రెండింతలుగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో సుమారు 7,000 కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారులు నిర్మించామన్నారు. భారతదేశ కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటుతూ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచి, ఉగ్రదాడులకు సమాధానం చెప్పారన్నారు. వ్యాపారాలు పెట్టుకునే వారికి బాసటగా నిలిచారన్నారు.

2047 వరకు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారని అన్నారు. తొలుత ఆమె 11ఏళ్లలో చేసిన అభివృద్ధిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కార్పొరేటర్లు చాడ స్వాతిరెడ్డి, గుజ్జుల వసంత, బైరి లక్ష్మి, రావుల కోమల నాయకులు కాశీప్రసాద్, కిషన్, సీతారాంనాయక్, దేవేందర్‌రెడ్డి, విజయచందర్‌రెడ్డి, సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిపైనే పోటీ చేస్తా..

- ఫోన్‌ట్యాపింగ్ నుంచి తప్పించుకోలేరు.. మంత్రిగా అక్రమాలకు పాల్పడ్డారు..
- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి



వరంగల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎక్కడి నుంచి పోటీ చేసినా, తాను ఆయనపై అక్కడి నుంచే పోటీకి దిగుతానని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. అమెరికాలో స్థిరపడిన తాను.. ఎర్రబెల్లి చేసిన తప్పుల వల్లే రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళలకు 33శాతం సీట్లు రిజర్వుడు అవుతాయన్నారు. పాలకుర్తి మహిళలకే రిజర్వుడు అవుతుందని, అక్కడి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పోటీ చేస్తారని తెలిపారు. ఎర్రబెల్లి ఎక్కడికి పారిపోయి పోటీ చేసినా తాను ఆయనపై పోటీ చేస్తానని తెలిపారు. వర్ధన్నపేట నుంచి ఎర్రబెల్లి పోటీకి దిగితే తాను రెడీ అన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి జైలుకు వెళతారని చెప్పారు. తన ఫోన్‌లు కూడా ట్యాపింగ్‌కు గురయ్యాయని, ప్రభాకర్‌రావును పోలీసులు విచారిస్తున్నారని, త్వరలోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఝాన్సీరెడ్డి అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్త్రీనిధి రుణాల గోల్‌మాల్ చేశారని, వీటిపై విచారణ జరుగుతోందని, త్వరలోనే ఎర్రబెల్లి జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఝాన్సీరెడ్డి పేర్కొన్నారు.



పక్షుల దాహార్తి తీర్చడానికి కుండీల ఏర్పాటు



పొనకల్ పల్లెప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన కుండీ

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వినూత్న తరహాలో పక్షులకు దాహార్తి ని తీర్చడానికి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది కలసి నీటి కుండీలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని పల్లె ప్రకృతివనం, జీపీ కార్యాలయం దగ్గర నీటి కుండీలను ఏర్పాటు చేసి పక్షులు నీరు తాగే విధంగా జీపీ సిబ్బంది ఏర్పాటు చేసిన తీరును పలువురు అభినందిస్తున్నారు.

- దుగ్గొండి (ఆంధ్రజ్యోతి)

బాలకార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దాం

నర్సంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దామని వనప్రేమి, సామాజికవేత్త గోకా రామస్వామి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోడెం కాంతారావు, ఛాయ సంస్థ నిర్వాహకుడు కోట డేవిడ్, వలంటీర్ కాసుల వెంకటాచారి, ఉపాధ్యాయులు, సిబ్బంది శౌరిఅసంతీన, సుజాత, నిర్మల, స్వరూప, పద్మ, శైలజ, దివ్య, మల్లయ్య, రాజేశ్, పీఈటీ స్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు

• వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



విద్యార్థులకు అక్షర అభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాదులని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని పాజెక్టు-1 ఫిరంగిగడ్డలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి ప్రారంభించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆప్యాయంగా వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు, గర్భిణులకు మధ్యాహ్న భోజనంలో ఎగ్ బిర్యాని వడ్డించారు. న్యూట్రీ గార్డెన్‌లో కూరగాయల విత్తనాలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ చిన్నారులతో సమయం వెచ్చించి వారి అభిరుచులు తెలుసుకొని వారితో ఉంటూ పిల్లలకు అక్షరాలు నేర్పించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అంగన్‌వాడీలో బాలామృతం, గుడ్లు, కందిపప్పు, పౌష్టికాహారం పిల్లలకు, గర్భిణులకు అందించాలన్నారు. అంగన్‌వాడీలో చేరిన పిల్లలు మళ్లీ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించేలా చూడాలని అధికారులను, తల్లిదండ్రులను ఎమ్మెల్యే కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి వర్ధన్నపేట నియోజకవర్గానికి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా వెల్ఫేర్ అధికారిణి రాజమణి, మునిసిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, వర్ధన్నపేట ఐసీడీఎస్ సీడీపీవో దేహోరా, సూపర్‌వైజర్ లలిత, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, బ్లాక్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

• పేదోడి సొంతింటి కల నెరవేరుతుంది

పేదవాడికి సొంతింటి కల నెరవేరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని 12వ డివిజన్‌లో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే నాగరాజు స్థానిక పార్టీ నాయకులతో కలిసి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఇమ్మడి సుధీర్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఏఎంసీ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, యూత్ అధ్యక్షుడు పత్రి భాను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తూల్ల రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, మాజీ కౌన్సిలర్ సమ్మెట సుధీర్, ఎమ్డీ.అన్వర్, కొండేటి సుధాకర్, చీటూరి రాజు, కొండేటి బాలకృష్ణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించాలి

పర్వతగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించాలని పర్వతగిరి ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్ సూచించారు. గురువారం పర్వతగిరి మండల కేంద్రంలో ముగ్గు పోసుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు త్వరగా ముగ్గులు పోసి పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శేషు, ఇన్‌చార్జి కార్యదర్శి మాధవుడు, కారోబార్ మేడిశెట్టి కరుణాకర్, కంప్యూటర్ ఆపరేటర్ షబానా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపే, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన కంచ ఐలయ్య సోదరుడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు, గొల్ల కురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అబోతు రాజు పరామర్శించి, మృతుని చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ నెల 16న పాపయ్యపేటలో నిర్వహించనున్న కార్యక్రమంలో గొల్ల కురుమలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట బీసీ పవర్ అధికార ప్రతినిధి మంచిక రాజుగౌడ్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

కస్తూర్బాలో కాంట్రాక్టు అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పర్వతగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ) మంజూరైంది. ఎంఎల్‌టీ గ్రూపులో రెండు అధ్యాపక పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నజియా సల్మా, మండల విద్యాశాఖ అధికారి లింగారెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోగా కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చెక్కును అందిస్తున్న ఫోటోగ్రాఫర్స్

ఖానాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరుకు చెందిన ఫోటోగ్రాఫర్ కాతం సాయికుమార్ గత నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా, జిల్లా ఫోటో,వీడియో గ్రాఫర్స్ అసోసియోషన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ భరోసా కింద రూ.4.20లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో మండల అసోసియేషన్ అధ్యక్షుడు తడుగుల స్వామి, ఉపాధ్యక్షుడు జాడి కిరణ్, ప్రధాన కార్యదర్శి తూడి కుమార్, కోశాధికారి పోల్సాని రవి, గౌరవ అధ్యక్షుడు బయ్య శ్యామ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కాడెద్దు మృతి

వర్ధన్నపేట రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లంద గ్రామ శివారులోని లక్ష్మీగార్డెన్ సమీపంలో విద్యుత్ షాక్‌తో కాడెద్దు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఇల్లంద గ్రామానికి చెందిన బొంతల అనిల్‌కు చెందిన రూ.75 వేల విలువ గల కాడెద్దు మేతకు వెళ్లి వస్తుండగా, ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడంతో తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు అనిల్ తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

బడిబాట పట్టిన విద్యార్థులు

• పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ

నర్సంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం బడిగంట మోగిం ది. గురువారం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సందడి మొదలైంది. మొదటి రోజు బడి బాట పట్టి పాఠశాలలకు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. నర్సంపేట మండలంలో 50 ప్రభుత్వ పాఠశాలలున్నా యి. ఇందులో 31 ప్రాథమిక పాఠశాలలు. 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో గత విద్యాసంవత్సరం 3508 మంది విద్యార్థులు ఉండగా, 315మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేశా రు. మొదటి రోజు 50పాఠశాలల్లో 811మంది విద్యార్థులు హాజరయ్యారు. పొరుగు ప్రాంతాల్లోని చుట్టాల ఇళ్లకు, విహార యాత్రలకు వెళ్లిన విద్యార్థు లు తిరిగి రాకపోవడంతో హాజరు శాతం తగ్గిందని, మరో రెండు మూడు రోజుల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఎంఈవో సారయ్య తెలిపారు. పాఠశాలల పునః ప్రారంభం రోజున వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు.

• గీసుగొండ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతుల ను కల్పించడంలో పాటు డిజిటల్ క్లాస్ రూంలలో ఆధునిక విద్యా బోధన చేస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ అన్నారు. మండలంలోని ఊకల్, గంగదేవిపల్లి పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, దుస్తులను పంపిణీచేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గంగదేవిపల్లి జీపీలో ఏర్పాటుచేసిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. విద్యావ్య వస్థను పటిష్టం చేయడానికి జిల్లా వ్యాప్తంగా 3వేల మంది టీచర్లకు వేస విలో ప్రత్యేక శిక్షణను ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ గ్రామస్థులపై కూడా ఉందన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఉన్నతవిద్యలో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రజాక్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని జిల్లా మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్‌తేజ అన్నారు గురువారం మండలంలోని పాపయ్యపేట, జల్లి, చెన్నారావుపేట పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. హెచ్‌ఎంలు పాఠశాలలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఎంఆర్‌సీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు.



ల్యాబర్తి పాఠశాలలో అడ్మిషన్ ఫారం, దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాపమ్మ, ప్రభాకర్‌రావు, ఈదునూరి రవిందర్‌రెడ్డి, పత్తి నర్సింహారెడ్డి, వేముల కిషోర్, ఇల్ల సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

• సంగెం (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించి పాఠ శాలల మనుగడను కాపాడుకోవాలని సీఎంవో కుడికాల సుభాష్ చెప్పారు. గురువారం మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ పాఠశాల అవరణలో నూతన విద్య సంవత్సర ప్రారంభ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు విజయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్య తనిస్తూ ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి నిర్ణయించారన్నారు. మొదటగా విద్యార్థులకు నూతన విద్య సంవత్సరం సందర్భంగా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠ శాల ఆవరణలో ముగ్గులు వేసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ అనుముల శ్రీలత, మాజీ సర్పంచ్ గూడ కుమారస్వామి, మడత కేశవులు, పోషాల నవీన్‌గౌడ్, అనుముల కుమారస్వామి, వేల్పుల కుమారస్వామి పాల్గొన్నారు. గవిచర్లలో గల మోడల్ (ఆదర్శ) స్కూల్‌లో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు నూతన విద్య సంవత్సరం సందర్భంగా స్వీట్లతో పాటు పూలు అందించి స్వాగతం పలికారు. ఆనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులను అందించారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో గురువారం విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను తహసీల్దార్ రమేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచి త మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, పుస్తకాలు అందిస్తోందన్నారు. ప్రభు త్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం విజయ, ఎంపీడీవో సునీల్‌కుమార్, ఎస్సై రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబర్తి ఉపాధ్యాయుల పనితీరు భేష్

• కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వర్ధన్నపేట రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మన ఊరు మన బడి పేరిట విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో చైతన్యం నింపుతూ చేస్తున్న కార్యక్రమాల పట్ల ల్యాబర్తి ఉపాధ్యాయుల పనితీరు భేషుగ్గా ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద కితాబిచ్చారు. గురువారం మండలంలోని ల్యాబర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలను వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను, చుట్టూ పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. నూతనంగా బడిలో చేరిన పలువురు విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలు, దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ల్యాబర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుల పనితీరు బాగానే వినిపిస్తోందని, ఇదే స్ఫూర్తితో మరింత మెరుగ్గా పనిచేసి విద్యార్థుల శాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పచ్చళ్లు, చింతపండు, టమాటా లాంటి పుల్లటి వస్తువులు కాకుండా కోడిగుడ్డు, ఐరన్ పుడ్స్ వంటి వాటిని తీసుకునేలా చేయాలన్నారు. విద్యార్థినిల తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించి వారికి సూచనలు చేయాలని, ఆడపిల్లలకు భవిష్యత్తులో ఇబ్బందులు కాకుండా ఇప్పటి నుంచే ఆహారంలో మార్పులు చేసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ బడిని అభివృద్ధి చేసుకోవడం విద్యార్థుల వరమని అభివర్ణించారు. ఇప్పటికే చాలా కార్యక్రమాలు చేస్తున్నారని, మరింత సహకారంతో ముందుకెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడిలో చేస్తున్న కార్యక్రమాలు, దాతల సహకారం, విద్యార్థుల ప్రగతిపై కలెక్టర్‌కు ఉపాధ్యాయుడు హరిలాల్ వివరించారు. పాఠశాలకు మ్యాథ్స్ అసిస్టెంట్ కొరతఉందని కోరడంతో వెంటనే డీఈవోకు తెలిపి డిప్యూటేషన్‌పై పంపించాలని ఆదేశాల జారీచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో శ్రీధర్, హెచ్‌ఎం వేణు కుమార్, పీఈటీ జలగం రఘువీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బండౌతపురంలో గురువారం విద్యార్థులకు హెచ్‌ఎం శేఖర్ ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, రవి, ప్రవీణ్ కుమార్, శ్రవణ్ కుమార్, ఆమని, సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడి పాటించండి.. భూసారాన్ని కాపాడండి

పర్వతగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పంట మార్పిడి పాటిస్తే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వరంగల్ వ్యవసాయ శాస్త్రవేత్తలు హేమ శరత్‌చంద్ర, శ్రీజన్ తెలిపారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని గురువారం కల్లెడలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా తక్కువ వాడకం అంటే వరి పంటలో కేవలం 100 కిలోల యూరియా 50 కిలోల డీఏపీ, 25 కిలోల పొటాష్ వాడుకోవాలన్నారు. సాగు ఖర్చును తగ్గించుకొని నేల, నీరు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. అవసరం మేరకే రసాయనాలను వాడుకోవాలని, ఎరువులు, గడ్డి మందులు, పురుగు మందులు, తెగులు మందులు, సిఫారసు మేరకు మాత్రమే వాడాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు రశీదును రైతులు భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్.రాములు, డాక్టర్ పి.ప్రశాంత్, మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ఆర్.ప్రశాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.చందూలాల్, వ్యవసాయ విద్యార్థులు సంజీవని, గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు గోపిక, అర్చన అన్నారు. గురువారం బుధరావుపేట రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు అనే కార్యక్రమంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగులో యూరియాని తగ్గించి వాడటం, పంట మార్పిడి విధానం, చెట్ల పెంపకం, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు రాజ్‌కుమార్, అంకుశవలి తదితరులు పాల్గొన్నారు.

•రాయపర్తి (ఆంధ్రజ్యోతి):పంటల మార్పిడితోనే నేలకు ఆరోగ్యకరమని అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఓం ప్రకాష్, మాధవి, ఏవో వీరభద్రంలు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఏఈవోలు కావ్య, రాజేష్, క్రాంతి కుమార్, మనస్విని, సాయి పాల్గొన్నారు.

భూభారతి సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

దుగ్గొండి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : భూభారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని, పెండింగ్ సమస్యలను సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో ఉమారాణి అన్నారు. మండలంలోని ముద్దునూర్‌లో గురువారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆర్డీవో సందర్శించి, పరిశీలన చేసి మాట్లాడారు. రైతులు సమస్యలను తెలపాలని, సాదా బైనామ, వారసత్వం తదితర కేసులు ఎక్కువ ఉన్నాయన్నారు. రైతుల దగ్గర ఏలాంటి ఆధారాలు ఉన్న తెలపాలన్నారు. అదేవిధంగా మండలంలోని మల్లంపల్లిలో భూభారతి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, డీటీ ఉమారాణి, ఆర్ఐలు రాంబాబు, చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో రైతుల సమస్యలు పరిష్కరించుకోవాలని రాయపర్తి



ముద్దునూర్‌లోని రెవెన్యూ సదస్సును పరిశీలన చేస్తున్న ఆర్డీవో ఉమారాణి

తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని సన్నూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో డీటీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ చంద్రమోహన్, కిర్మణ్మయి, సంధ్యారాణి, మురళి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

చెన్నారావుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన తహసీల్దార్‌గా మహ్మద్ అబీద్ అలీ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ తశీల్దార్‌గా పనిచేసిన ఫణికుమార్ వరంగల్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న మహ్మద్ అబీద్ అలీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా నంగునూరి రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఖానాపురం వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రాజేశ్వర్‌రావు నియామకం

దుగ్గొండి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గొండి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎ.రాజేశ్వర్‌రావును నియామిస్తున్నట్లు గురువారం జిల్లా కలెక్టర్ ఉత్త ర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న రవిచంద్రారెడ్డి నర్సంపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నర్సంపేటలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.రాజేశ్వర్‌రావును దుగ్గొండి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 3 నుంచి మండలంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సుకు రాజేశ్వర్‌రావు టీమ్2కు లీడర్‌గా వ్యవహరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

గీసుగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మచ్చాపూర్ అపెక్స్ కళాశాల సమీపంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి వేముల రవీందర్‌రెడ్డి తన భార్య మమత, కూతురు విద్య, తల్లి ఏలేంద్ర, తండ్రి రామచంద్రారెడ్డితో కలిసి సొంత కారులో ముత్తోజిపేట బంధువుల ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి వరంగల్ వైపు మిర్చి లోడుతో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వేగంగా కారును ఢీకొంది. దీంతో అందులో ఉన్న రవీందర్‌రెడ్డి, మమత, విద్య, ఏలేంద్ర, రామచంద్రారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌రెడ్డి బావమరిది గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

గీసుగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాయంపేటహవేలిలో గురువారం నిర్వహించిన బడిబాటలో ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించికోవటానికి తల్లిదండ్రులు, గ్రామస్థులు తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్‌రావు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

ఖానాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ఉద్యమకారుల హామీలను వెంటనే నెరవేర్చాలని ఉద్యకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్ నందగిరి రజినీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని ఆలయాలు, చర్చిల్లో, దర్గాల్లో ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా ఈ నెల 14, 15తేదీల్లో కరీంనగర్ జిల్లాలోని తపాల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించే చండీ రుద్ర సహిత సుదర్శన నరసింహస్వామి మహాయాగంలో ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరాధ్యదేవత వాజ్జయ్‌కీ జలాభిషేకం



వాజ్జయ్‌కీ జలపూజలు చేస్తున్న గిరిజనులు

నెక్కొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తి ముగిసిన వెంటనే భారీ వర్షాలు పడాల్సి ఉండగా వర్షాలు కురవకపోవడంతో వర్షాలు కురువాలని వేడుకుంటూ గిరిజనుల ఆరాధ్యదేవత వాజ్జయ్‌కీ మండలంలోని మహబూబ్‌నాయక్ గ్రామంలో గిరిజన యువతులు గురువారం జలాభిషేక పూజలు జరిపారు. ఆటపాటలు డప్పు చప్పుళ్లతో యువతులు బిందెలతో నీరు తీసుకువచ్చి వేపచెట్టు కింద కొలువైన దేవతామూర్తికి జలాభిషేకం జరిపారు. తొలకరి వర్షాలతో సాగుచేసిన విత్తనాలు మొలకెత్తగా వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తిన విత్తనాలు దెబ్బతినడంతో రైతులు నష్టాలకు గురవుతున్నారంటూ గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో లంబాడి ఐక్యవేదిక యూత్ అధ్యక్షుడు భూక్య సురేష్, భూక్య దేవి, మాలోతు అంబలి, సౌందర్య, సుమలత, మంగమ్మ, ప్రమీల, చక్రి, అనిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడికి పరామర్శ

పర్వతగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతనెక్కొండకు చెందిన గీత కార్మికుడు మడూరి రమేష్ తాటిచెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. నడుము, కుడికాలు విరగడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విష యం తెలుసుకున్న గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టపురం ఏకాం తంగౌడ్ ఆస్పత్రికి గురువారం చేరుకొని బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్స్‌గ్రేషియా త్వరగా వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతియాదవ్, బీజేపీ జిల్లా ప్రతినిధి కుడికాల శ్రీధర్, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి దేవేందర్, కొమురయ్య ఉన్నారు.

వరుణ దేవుడి కోసం కప్పతల్లి ఆట



గంగదేవిపల్లిలో కప్పతల్లి ఆట ఆడుతున్న యువకులు

గీసుగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలుపడాలని వరుణ దేవుడి కోసం గంగదేవిపల్లిలో స్థానిక యువకులు గురువారం కప్పతల్లి ఆటను ఆడా రు. దశాబ్దాల కిందట మరిచిన కప్పతల్లి ఆటను గ్రామస్థులు ఆసక్తిక రంగా తిలకించారు. యువకులు కప్పను గుడ్డలో పెట్టి రోకలికి కట్టి దానిని భుజాలపై పెట్టికొని కప్పపై నీరుపోస్తూ డప్పులతో ఊరేగించారు. కప్పతో ఉన్న రోకలిని మోసేవారిపై నీళ్లు పోస్తూ వర్షాలు పడాలని వరుణదేవుడిని ప్రార్థించారు. మే చివరి వారంలో వర్షాలు పడి జూన్‌లో వర్షాలు పడకపోవడంతో విత్తనాలు నాటిన రైతులు దిగాలు పడుతున్నారు. జూన్ మొదటి వారంలో ఊరించిన నైరుతిపవనాలు కానరాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.